ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
బుధవారం 5 మార్చి 2025



విద్యుత్ చార్జీలు పెంచే ఆలోచన లేదు: మంత్రి జార్జ్

బెంగళూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు పెంచే ఆలోచన లేదని విద్యుత్‌శాఖ మంత్రి కేజే జార్జ్ తెలిపారు. మంగళవారం శాసనసభ జీరో అవర్‌లో బీజేపీ ఎమ్మెల్యే సిద్దుసవది లోడ్‌షెడ్డింగ్‌పై అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. 24 గంటలపాటు సాధారణ కరెంటు కొనసాగుతుందన్నారు. వ్యవసాయ పంప్‌సెట్లకు 7 గంటల విద్యుత్ కొనసాగిస్తామన్నారు. ఇటీవలే విద్యుత్ నియంత్రణ మండలిలో సభ జరిపామని, విద్యుత్ కొరత లేదన్నారు. సింగిల్‌ఫేజ్‌ను త్రీఫేజ్‌గా మారిస్తే ఒత్తిడి పెరిగి బ్రేక్ డౌన్‌లు వస్తాయన్నారు.


కొడగు జిల్లా బ్రహ్మగిరి వద్ద 2020లో కుంగిన భూమి

ప్రమాదపుటంచున పశ్చిమ కనుమలు..!

- పలు ప్రాంతాల్లో కూలుతున్న మట్టిచరియలు
- 19ఏళ్లలో 1403 ప్రమాదాలు.. 98 మంది మృతి
- ఆక్రమణలు, మట్టి తవ్వకాలతో మరింత ప్రమాదం
- విపత్తు నిర్వహణ విభాగం హెచ్చరికలు

బెంగళూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): దేశంలో సుదూర విస్తీర్ణంతోపాటు పలు రాష్ట్రాల్లో విస్తారంగాఉన్న పశ్చిమకనుమలు ప్రమాదపుటంచుకు చేరుతున్నాయి. పశ్చిమకనుమలు గుజరాత్ నుంచి ప్రారంభమై మహారాష్ట్ర, గోవా, కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో ఉన్నాయి. దట్టమైన అటవీప్రాంతం, కొండలు కలిగి యున్న పశ్చిమకనుమలలో పదులకొలదీ నదులు ఉద్భవిస్తాయి. ఎన్నో సరస్సులు, అంతకుమించి జలపాతాలు పశ్చిమకనుమలకు ప్రత్యేకం. రాష్ట్రంలో 8 జిల్లాల పరిధిలో పశ్చిమ కనుమల విస్తరించి ఉన్నాయి.

దశాబ్దాలుగా దోపిడీ

నియంత్రణలేని పర్యాటక అభివృద్ధి ముసుగులో పశ్చిమకనుమల్లో ఆక్రమణలు కొనసాగుతున్నాయి. దశాబ్దాకాలంగా పశ్చిమకనుమలపై పలుకుబడి కల్గినవారి దోపిడీ కొనసాగుతూనే ఉంది. ఇలా ఎనిమిది జిల్లాల పరిధిలో గనులకోసం తవ్వకాలు, అటవీప్రాంతంలో రిసార్టులు, హోంస్టేలు, ఇతరత్రా వసతి కేంద్రాలు పెరిగిపోతున్నాయి. పశ్చిమకనుమలలో ఆక్రమణలు పెరగడంతో తరచూ మట్టిచరియలు విరగడం, భూమి కుంగిపోయే సంఘటనలు పెరుగుతున్నాయి. ఇటీవల నాలుగైదేళ్లుగా తీవ్రమైన ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. రెవెన్యూ, విపత్తు నిర్వహణా విభాగం ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి ఓ నివేదిక సమర్పించింది. పశ్చిమకనుమల్లో ఆక్రమణల పట్ల చర్యలు తీసుకోని పక్షంలో భవిష్యత్తులో తీవ్రమైన ప్రమాదాలు చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించింది. ప్రధానంగా కేరళ రాష్ట్రం వయనాడ్‌లో కొన్ని నెలల క్రితం పశ్చిమకనుమలకు అనుబంధమైన ప్రాం తంలో చోటు చేసుకున్న ప్రమాదాన్ని నివేదికలో ప్రస్తావించింది.

యథేచ్ఛగా తవ్వకాలు..

పశ్చిమకనుమల్లో 19ఏళ్లుగా 1403 సార్లు భూమి కుంగిపోయిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. 98మంది మృత్యువాత చెందారు. అభివృద్ధి పేరిట శాస్త్రీయతలేకుండా గుట్టలను తవ్వడం, రోడ్ల వెడల్పుకోసం పలు కొండగుట్టలను సమాంతరం చేయడం, మట్టి తవ్వకాలు వంటి చర్యలు నిరంతరంగా కొనసాగుతున్నాయి. మానవనిర్మిత ఒత్తిళ్లు పెరిగిపోతున్నందున సహజత్వాన్ని కోల్పోతున్న పశ్చిమ కనుమలలో కుంచించుకుపోయే సంఘటనలు తీవ్రం అవుతున్నాయి. పశ్చిమ కనుమల పరిధిలో 8 జిల్లాల్లో 31,231 చదరపు కిలోమీటర్ల ప్రదేశంలో భూమి కుంచించుకుపోయే ప్రమాదం ఉందని విపత్తు నిర్వహణా సంస్థ నివేదికలో ప్రస్తావించింది.

ప్రమాదంలో కొడగు జిల్లా

ప్రకృతి అందాలకు పేరొంది, ప్రసిద్ధి చెందిన పర్యాటక ప్రాంతంగా విరాసిల్లుతున్న కొడగు జిల్లా ప్రమాదంలో పడింది. ఈ ప్రాంతంలో భౌగోళికంగా 96శాతానికిపైగా భూమి కుంచించుకుపోయే ప్రమాదం ఉందని దక్షిణకన్నడ జిల్లాలో 94.9, ఉత్తరకన్నడ జిల్లాలో 81.3కుపైగా ప్రదేశాలు ప్రమాదకరంగా ఉన్నాయని నివేదికలో పేర్కొన్నారు. ఇప్పటికే ఉత్తరకన్నడ జిల్లాలో 609 భూమి కుంచించుకుపోయిన ప్రమాదం ఉండగా, చిక్కమగళూరులో 260, కొడగులో 188, దక్షిణకన్నడలో 166 భూమి కుంచించుకపోయిన ప్రమాదాలు ఉన్నాయి. కొడగులో 53మంది, ఉత్తరకన్నడలో 34, దక్షిణకన్నడ జిల్లాలో 11మంది ప్రజలు మృతి చెందారు.

రియల్ ఎస్టేట్ దందా

భూమి కుంగిపోయేందుకు ప్రధాన కారణాలలో శాస్త్రీయత లేని అభివృద్ధి పనులు, భారీ స్థాయిలో సుదీర్ఘ కాలంగా వర్షాలు, వర్షపునీరు సహజంగా ముందుకెళ్లే పరిస్థితి లేకుండా అడ్డుకునే చర్యలు, ప్రకృతిలో ఆక్రమణల వలన కుంగుబాటుకు కారణమవుతున్నాయి. అటవీప్రాంతాన్ని నాశనం చేయడం కూడా ప్రకృతి వైపరీత్యాలకు కారణంగా ఉందని పేర్కొన్నారు. సహజమైన పశ్చిమకనుమలను కాపాడుకోకుండా, అనుకూలంగా మార్చుకుని కాఫీ, టీ ఎస్టేట్‌లను ఏర్పాటు చేసుకుని ప్రస్తుతం వాటి ప్రదేశంలో రియల్ ఎస్టేట్ దందా సాగిస్తున్నారు. ఇలా సహజత్వాన్ని కోల్పోతున్న పశ్చిమకనుమల్లో వర్షం వస్తే చాలు వృక్షాలు, మట్టి చరియలు కుంచించుకుపోయేందుకు కారణాలు అవుతున్నాయని జియాలజిస్ట్ డాక్టర్ టీజే రేణుకాప్రసాద్ అభిప్రాయపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని పర్యావరణాన్ని కాపాడాలని విజ్ఞానులు పేర్కొంటున్నారు.

కఠిన చర్యలు తీసుకోవాల్సిందే..

పశ్చిమకనుమల ప్రాంతాల్లో మానవ ఆక్రమణలు దశాబ్దాల కాలంగా కొనసాగుతున్నాయని ఇటీవల ఈ ప్రభావం పెరిగిందని ఇదే భవిష్యత్తుకు పెను ప్రమాదానికి సంకేతమని అభిప్రాయపడ్డారు. రాష్ట్రప్రభుత్వం కఠినంగా వ్యవహరించి, పశ్చిమకనుమల్లోని ఆక్రమణల పట్ల చర్యలు తీసుకోవడం భవిష్యత్తులో ఎటువంటి ప్రవేశం లేకుండా చూడాల్సిన బాధ్యత ఉంది. ప్రాజెక్టులు, జలాశయాలు, జాతీయ రహదారులతోపాటు శాస్త్రీయతలేని పనులను వదులుకోవాలని సూచించింది. పశ్చిమకనుమలలో ఇప్పటికైనా భూమి కుంగిపోయే ప్రమాదాలను నియంత్రణలోకి తేవాలంటే ఆక్రమణలపై ఏ విధమైన ఒత్తిళ్లు లేకుండా కఠినచర్యలు తీసుకోవాలని సూచించారు.


కేరళ రాష్ట్రం వయనాడ్ వద్ద కుంగిన కొండలు (ఫైల్)

ఒక దేశం-ఒక ఎన్నిక సదస్సుకు

మాజీ ఉపరాష్ట్రపతి రాక



బెంగళూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కర్ణాటక వాణిజ్య పరిశ్రమల సమాఖ్య ఈనెల 7వ తేదీ నిర్వహిస్తున్న ఒక దేశం - ఒక ఎన్నిక సదస్సుకు ముఖ్య అతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు హాజరవుతున్నారు. పరిశ్రమల సమాఖ్య అధ్యక్షుడు ఎంజి బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంపీ పీసీ మోహన్ పాల్గొంటారన్నారు. సాయంత్రం 5 గంటలకు ఎఫ్‌కేసీసీఐ ఆడిటోరియంలో సదస్సు ఉంటుందన్నారు.


ఫ్రీడం పార్కు నిరసనలో భారీగా పాల్గొన్న భోజన ఏజెన్సీ కార్మికులు

వేతనాలు పెంచాలని నిరసన

ఫ్రీడం పార్కుకు భారీగా తరలివచ్చిన భోజన ఏజెన్సీ నిర్వాహకులు

బెంగళూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): వేతనాలు పెంచాలని కోరుతూ మధ్యాహ్న భోజన ఏజెన్సీల ఆధ్వర్యంలో నగరంలోని ఫ్రీడంపార్కులో మంగళవారం నిరవధిక ధర్నా చేపట్టారు. ఈనెల 7న ప్రవేశపెట్టే బడ్జెట్‌లో తమ డిమాండ్లు అమలు చేయాలని కోరారు. వేతనాలు పెంచాలని వారు సుదీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్నారు. మరో నెలరోజుల్లో విద్యాసంవత్సరం ముగియనుందని, ఆ తర్వాత రెండు నెలలపాటు పట్టించుకునేవారు ఉండరని, ఇన్నేళ్లుగా పోరాడుతున్నా తమ కష్టాలు తీర్చే వారే లేరని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాల పెంపునకు సంబంధించి గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నేతృత్వంలో జరిగిన ఈ నిరసనలో అక్షర దాసోహ, మధ్యాహ్నభోజన కాంట్రాక్ట్ వర్కర్స్ భారీగా పాల్గొన్నారు.

- పాదయాత్రగా వెళ్తూ

మృత్యు ఒడిలోకి..


8
సెల్ఫీ తీసుకుంటున్న నాగరాజు, గణేష్ (ఫైల్)



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సెహరీ
6.30	5.17
బుధవారం సాయంత్రం	గురువారం ఉదయం

నాటీ శంకర్..!

- 260 నాటీ రకం వరి వంగడాలను సాగు చేసి సంరక్షించిన శంకర్ హనుమంత
- సొంత మార్కెట్‌తో విశేష లాభాలు
- కేంద్రం నుంచి అవార్డు.. రూ.10 లక్షల ప్రోత్సాహకం
- చదివింది మూడు.. థాయ్‌ల్యాండ్, మయన్మార్, నేపాల్ తదితర దేశాల్లో అధ్యయనం

బెంగళూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): పంటలు అంటే హైబ్రీడ్‌గా మారిన ఆధునిక యుగంలో దేశవాళీ (నాటిరకం) వంగడాలు కనుమరుగవుతున్నాయి. ఆకు కూరలు, కూరగాయలు, పండ్లతో పాటు ఆహార ధాన్యాలు కూడా హైబ్రీడ్ రకాలు వచ్చేశాయి. విత్తనం లేనిదే పండు లేదనే కాలం నుంచి, సీడ్‌లెస్ పేరిట ఎన్నో కూరగాయలు, పండ్లు మార్కెట్‌లోకి వచ్చాయి. కేవలం సీజన్‌లో మాత్రమే గతంలో లభించే ఎన్నో రకాల పండ్లు, కూరగాయలు ఏడాది పొడవునా మార్కెట్‌లో దర్శనమిస్తున్నాయి. ఇదంతా హైబ్రీడ్ జమానా అనడంలో సందేహం లేదు. అయితే బెళగావి జిల్లాలో ఓ రైతు ఏకంగా 260 వరి వంగడాలను సేకరించి వాటిని పెంచి మార్కెటింగ్ చేస్తూ ఆదాయాన్ని గడిస్తున్నాడు. బెళగావి జిల్లా ఖానాపుర తాలూకా గుండేనట్టి అనే కుగ్రామంలో శంకర హనుమంత లంగటి అనే ఆదర్శరైతు నాటి వరి వంగడాల మనుగడను సాగిస్తున్నారు. దాదాపు కనుమరుగైపోతున్న వంగడాలను సేకరించి తన పొలంలో నాటి వాటిని పెంచి పోషిస్తున్నారు. పంట చేతికి వచ్చాక సదరు రకాన్ని కేవలం సాగు చేసుకునే వారికి మాత్రమే విక్రయిస్తున్నారు.


వరికంకులతో రైతు శంకర హనుమంత

2006 నుంచి సంరక్షణ

2006లో ధర్మస్థళ గ్రామీణాభివృద్ధి సంస్థ నిర్వహించిన వంగడాల సంరక్షణ జాతర నుంచి శంకర లంగటి 25 వరివంగడాలను సేకరించారు. వాటిని సాగు చేశారు. అప్పటి నుంచి దేశవాళీ రకం వరి వంగడాలను సేకరించి వాటిని రక్షించే చర్యలు కొనసాగించారు. ఇలా ప్రారంభమైన ప్రక్రియ ఎన్నో ప్రాంతాలకు విస్తరింపచేశారు. ఖానాపుర పశ్చిమభాగంలో కొంతమంది రైతులకు ప్రారంభంలో వరి వంగడాలు ఇచ్చేవారు. ఆ తర్వాత బెళగావి, ధారవాడ, మండ్య, మైసూరు, శివమొగ్గ జిల్లాలతోపాటు ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, మణిపుర ప్రాంతాలనుంచి కూడా విత్తనాలను సేకరించి వాటిని సంరక్షిస్తున్నారు.

260 రకాల వరి వంగడాలు

శంకర లంగటివద్ద 260 దేశవాళీ వరి వంగడాలు ఉన్నాయి. వాటిలో కెరె హక్కలసాలి, సొరాటా, అభినాళ, కెంపెనలె, ఆలూరు సన్న, హెగ్గె, ముల్లారి, హగ్గ, కొతంబరి సారి, బెళగావి బాసుమతి, జీరిగె సన్న, రామగళి, ముగద దొడగ్య, ముగదసిరి, కుంకుమసాలి, కుముద, గంగసాలి, చంపకసాలి, కాగసాలి, నడంతరసాలి, చండిక్యా, సిద్దసన్న, డాంబాళ సాలి, కెంప అసుడి, నవలసాడి, బరమాబ్లాక్, ఇంటాన్, కాలాజీరాతోపాటు పలు వంగడాలు ఉన్నాయి. శంకరలంగటి 12 ఎకరాల భూమిలో రబీ, ఖరీఫ్ సీజన్‌లలో వరిసాగు చేస్తారు. ఖరీఫ్‌లో వరి వంగడాలు పండించి రబీలో పప్పు శెనగ, పెసర, గోధుమ, అలసంది, కూరగాయలు సాగు చేస్తారు. పాడి పశువులు, చేపల పెంపకం కూడా చేస్తారు. పశువుల పేడతో పాటు సంపూర్ణంగా సేంద్రియసాగు పద్ధతినే పాటిస్తారు. ఒకప్పుడు సమీప ప్రాంతాలలోనే వంగడాలనుఅడిగినవారికి సమకూర్చేవారు. ఇటీవల శంకర లంగటి ఎగ్జిబిషన్‌లతోపాటు ఇతరత్రా వ్యవసాయానికి అనుబంధమైన మేళాలతోపాటు వివిధ రాష్ట్రాలకు విక్రయిస్తారు. ఏటా లక్షలాది రూపాయలు ఆదాయాన్ని గడిస్తున్నారు. సాధారణంగా ఒకటి పప్పు శనగ రకాలు మాత్రమే సాగుచేస్తారు. ఈయన నలుపు, తెలుపుతోపాటు పచ్చ, పసుపు వర్ణం కల్గిన శనగలను సాగు చేస్తారు. విత్తనాలను రైతులకు ఇచ్చి వారి నుంచే మార్కెట్‌ధరకంటే ఎక్కువ చెల్లించి కొనుగోలు చేస్తారు.

ఐసీఏఆర్‌లో నమోదు

నాటిరకం వరి వంగడాలకు శంకరలింగటి బ్రాండ్ అంబాసిడర్‌గా మారారు. మూడో తరగతి మాత్రమే చదివిన ఈయన థాయ్‌ల్యాండ్, మయన్మార్, నేపాల్, శ్రీలంక దేశాలలోనూ పంటల సాగు అధ్యయనానికి వెళ్లి వచ్చారు. రైతులు, విద్యార్థులకు పంటలసాగుకు సంబంధించి నాటిరకం వంగడాల నిల్వలకు సంబంధించి సలహాలు ఇస్తుంటారు. శంకరలంగటి భార్య మహాదేవి, కుమారులు హనుమంత, శివానందతోపాటు ఎనిమిదిమందితో కలిపి మార్కెటింగ్ జరుపుతున్నారు. కేంద్రప్రభుత్వ ఐసీఏఆర్ కేంద్రంలో ఈయన పండించే వంగడాలు రిజిస్ట్రేషన్ అయ్యాయి.

కేంద్రం నుంచి ప్రోత్సాహకం

ఏటా 40-50 క్వింటాళ్ల వరి, 2 క్వింటాళ్ల సిరిధాన్యాలు, 3 క్వింటాళ్ల శనగ, 4 క్వింటాళ్ల గోధుమలు, 2 క్వింటాళ్ల అలసంద, 3 క్వింటాళ్ల పెసర, ఒకటిన్నర క్వింటాళ్ల వేరుశనగ తదితర రకాల విత్తనాలు విక్రయిస్తారు. 2012లో వరి వంగడాల సంరక్షణకు సంబంధించి పురస్కారంతోపాటు 10 లక్షల రూపాయల బహుమానాన్ని కేంద్రం అందించింది. కర్ణాటక జీవవైవిధ్య మండలిలో పలు అవార్డులు వచ్చాయి.


పలు రకాల వంగడాలు


సభలో ప్రసంగిస్తున్న మంత్రి హెచ్‌కే పాటిల్

లైవ్‌లో ఎప్పుడూ..

మీరేనా..?

- కెమెరాలు మా వైపు తిప్పడం లేదు
- సభలో ప్రతిపక్ష సభ్యుల నిరసన

బెంగళూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య భిన్నమైన అంశం వాగ్వాదం సాగింది. శాసనసభ కలాపాలలో కేవలం మంత్రులు మాత్రమే లైవ్‌లో చూపుతున్నారని, ఇదెక్కడి విధానమని, ఎప్పుడూ లైవ్ కుడివైపునే ఉంటే మమ్మల్ని విస్మరించినట్లు కాదా..? అంటూ బీజేపీ ఎమ్మెల్యే బసనగౌడపాటిల్ యత్నాళ్ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. రెండు రోజులనుంచి స్పీకర్, మంత్రుల ముఖాలు మాత్రమే లైవ్‌లో వస్తున్నాయని, కనీసం బుధవారం నుంచి అయినా మమ్మల్ని కూడా చూపించాలన్నారు. అందుకు స్పీకర్ స్పందిస్తూ సాంకేతిక సమస్య ఉంటుందని, టెక్నికల్ సిబ్బందితో చర్చించి సమస్యను పరిష్కరిస్తానన్నారు. అంతలోనే మంత్రి ప్రియాంక ఖర్గే స్పందించారు. లోక్‌సభలోనూ ఇదే పరిస్థితి ఉందని, అక్కడా ప్రతిపక్ష నాయకుల ముఖాలు చూపడం లేదని ఎద్దేవా చేశారు. రాజకీయ నాయకులకు ప్రచారం అనేది ఆక్సిజన్ లాంటిదని, మీ పట్ల ఆసక్తితో త్వరలోనే సమస్యను పరిష్కరిస్తానని స్పీకర్ హామీనిచ్చారు.


స్పీకర్ యూటీ ఖాదర్

ఇన్వెస్ట్ కర్ణాటకతో 6 లక్షల మందికి ఉద్యోగాలు : మంత్రి ఎంబీ పాటిల్

ఇటీవల జరిగిన ఇన్వెస్ట్ కర్ణాటకకు ప్రపంచంలోని దిగ్గజ కంపెనీల ప్రతినిధులు భాగస్వామ్యులయ్యారని హామీ ఇచ్చిన పెట్టుబడులు సాకారమైతే 6 లక్షలమంది ఉద్యోగం సాధ్యం కానుందని మంత్రి ఎంబీ పాటిల్ అభిప్రాయపడ్డారు. పరిషత్‌లో ఎస్‌వీ సంకనూరు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఇన్వెస్ట్ కర్ణాటక 2025 సమావేశాన్ని 90 కోట్లతో నిర్వహించాలని అంచనా వేశామని, కానీ ఇప్పటివరకు 75 కోట్లు మాత్రమే చెల్లించామన్నారు. సమావేశంలో 3250మంది పరిశ్రమల ప్రతినిధులు, వివిధ రాష్ట్రాల నుంచి 266 మంది, వివిధ దేశాలనుంచి వివిధ కంపెనీలకు చెంది 72మంది పాల్గొన్నారు. 98 కంపెనీలతో ఒప్పందం చేసుకున్నామన్నారు. ఇన్వెస్ట్ కర్ణాటక 2022లో 57 కంపెనీలతో ఒప్పందం కుదిరిందని, వీటిలో 20 కంపెనీలకు అనుమతులు దక్కాయన్నారు.

క్రీడలకు ప్రోత్సాహం: మంత్రి బోసరాజు

తాలూకా, జిల్లా, రాష్ట్రస్థాయిలో క్రీడాకారులకు చైతన్యం తీసుకురాదలిచామని సభా నాయకుడు, మంత్రి బోసరాజు తెలిపారు. జేడీఎస్ సభ్యుడు ఎల్ బోజేగౌడ, ఎస్ వివేకానందలు 72వ నిబంధన కింద అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. రాష్ట్రస్థాయి క్రీడలలో రాణించిన విద్యార్థులు చదివే పాఠశాలలకు లక్ష రూపాయల గ్రాంటు ఇస్తామని ప్రకటించారు. తద్వారా క్రీడలకు అవసరమైన సౌలభ్యాలు పెంపొందింపచేయదలిచామన్నారు. కర్ణాటక రెసిడెన్షియల్ శిక్షణాసంస్థ 159 పాఠశాలలకు 1.33 కోట్లు మంజూరు చేశామన్నారు. పెట్రోలియం, సహజవాయువు నియంత్రణ మండలి అన్ని జిల్లాలతో కలిపి 18 భౌగోళిక ప్రదేశాలలో గ్యాస్ పంపిణీకి ఏజెన్సీలను కేటాయించామని మంత్రి ఎంబీ పాటిల్ తెలిపారు. బీజేపీ సభ్యుడు డీఎస్ అరుణ్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా నగరాలలో వంటగ్యాస్ పంపిణీ సీఎన్‌జీ స్టేషన్‌ల ద్వారా సమకూర్చదలిచామన్నారు.

వక్క రైతులకు పరిహారం : మంత్రి మల్లికార్జున

వక్క పంటలో నల్లమచ్చతోపాటు పలు రోగాలు ప్రబలుతున్నాయని తద్వారా రైతులు నష్టపోతున్నారని, వారికి పరిహారం ఇచ్చే విషయమై పరిశీలిస్తామని ఉద్యానవనశాఖ మంత్రి ఎస్ఎస్ మల్లికార్జున హామీ ఇచ్చారు. ప్రశ్నోత్తరాల వేళ కిశోర్‌కుమార్ పుత్తూరు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు.

ఖాజీ హర్షద్ అలికి సంతాపం

ఎమ్మెల్సీగా సీనియర్ పాత్రికేయుడిగా పేరొందిన ఖాజీ హర్షద్ అలి అకాల మృతి పట్ల పరిషత్‌లో తీవ్ర సంతాపం తెలిపారు. సభాపతి బసవరాజహొరట్టి సంతాప సందేశాన్ని ప్రవేశపెట్టారు. బీడీఏ చైర్మన్‌గా వ్యవహరించారన్నారు. బీదర్ జిల్లా అభివృద్ధి కోసం ఆయన ఎంతో త్యాగం చేశారని కొనియాడారు. అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె మాట్లాడుతూ ఆయన ఓ మృదు స్వభావి రాజకీయ నాయకుడన్నారు. ప్రతిపక్షనేత ఛలవాది నారాయణస్వామి మాట్లాడుతూ రెండుసార్లు ఎమ్మెల్సీగా పనిచేశారన్నారు. ముఖ్యమంత్రి ధరంసింగ్‌తో సన్నిహితుడిగా కొనసాగారన్నారు.


పరిషత్ సమావేశంలో సభ్యులు



క్లాక్ టవర్ సమీపంలోని షాపింగ్ కాంప్లెక్స్

సొంతం

కొందరి చేతుల్లోనే ఎస్సీ కార్పొరేషన్ దుకాణాలు

ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో ఉన్న దుకాణాలు కొందరి కబంధ హస్తాల్లో చిక్కుకున్నాయి. రెండున్నర దశాబ్దాలుగా వాటిలో తిష్ట వేసి, అద్దె కూడా చెల్లించకుండా కాలం గడుపుతున్నారు. ఎవరైనా అధికారులు గట్టిగా అడిగితే కుల సంఘాలు, రాజకీయ నాయకుల పేర్లతో వారిపై తిరగబడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ షాపింగ్ కాంప్లెక్స్ షాపులు కేటాయించే సమయంలో ఎన్నేళ్లకోసారి టెండర్లు నిర్వహించాలి? ఎన్ని సంవత్సరాలు లీజు అనే అంశాలను పొందుపరచక పోవడం వల్లే వారి ఆగడాలు సాగుతున్నట్లు సమాచారం. క్లాక్‌టవర్, కలెక్టరేట్‌లో సమీపంలో ఉన్న కాంప్లెక్స్‌లలో షాపులు దక్కించుకున్న కొందరు సంఘాలను, రాజకీయ పార్టీలను అడ్డుపెట్టుకొని ఐదారు షాపులను వారి వారి కుటుంబసభ్యులకు ఇప్పించుకున్నట్లు తెలుస్తోంది. కలెక్టర్, జేసీ స్పందించి ఎస్సీ కార్పొరేషన్ పరిధిలోని దుకాణాలకు టెండర్లు నిర్వహించి, కొత్తవారికి అవకాశం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం



ప్రెస్‌క్లబ్

- 25 ఏళ్లకుపైగా పాతుకుపోయిన వైనం
- షాపు దక్కించుకుని బయటి వ్యక్తులకు అప్పగింత
- రూ.లక్షల్లో అడ్వాన్సులు, రూ. వేలల్లో బాడుగల ఆర్జన

ఎస్సీ కార్పొరేషన్ పరిధిలోని నగరంలో క్లాక్‌టవర్, కలెక్టరేట్ సమీపంలో 40 దుకాణాలను నిర్మించారు. అప్పట్లో వీటికి నెలకు రూ. 250లు చొప్పున బాడుగలు నిర్ణయించారు. ప్రతి ఐదేళ్లకోసారి రెన్యువల్, టెండర్లు నిర్వహించేలా అప్పటి ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు సమాచారం. అయితే నేటి వరకూ షాపులు రెన్యువల్ చేయలేదు. టెండర్లు ఆహ్వానించ

ఎస్సీ కార్పొరేషన్ ఆదాయానికి భారీ గండి

లేదు. దీంతో 25 ఏళ్ల కింద ట నిర్ణయించిన రూ. 250లు బాడుగనే కొందరు చెల్లిస్తుండగా... మరి కొందరు ఆ బాడుగను కూడా సక్రమంగా చెల్లించనట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో మాత్రం ఇతర వ్యక్తులకు షాపులు అప్పగించి ఒక్కో దాని నుంచి రూ. 2 లక్షలు అడ్వాన్సులు, నెలకు రూ. 10 వేల నుంచి రూ. 15 వేలు బాడుగలు తీసుకుంటూ ఎస్సీ కార్పొరేషన్ ఆదాయానికి భారీస్థాయిలోనే గండి కొడుతున్నట్లు సమాచారం.

ఎక్కువ అద్దెకు బయటి వ్యక్తులకు...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1997, 2002, 2005 సంవత్సర కాలంలో ఎస్సీ కార్పొరేషన్ కింద దాదాపు 200కుపైగా దుకాణాలను నిర్మించింది. ఒక్కో నియోజకవర్గంలో దాదాపు 10, 15 షాపులు చొప్పున ఆమోదం తెలిపి నిర్మించారు. దుకాణాలన్నీ ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో ఉన్నప్పటికీ జిల్లా సెలెక్షన్ కమిటీ కింద కలెక్టర్‌కు ఎంపిక ప్రక్రియను అప్పగించారు. షాపులు అప్పగించే సమయంలో బాడుగ చెల్లించడంలో మూడు నెలల వరకూ గడువు ఉంటుందని.. అప్పటికీ ఎవరైనా చెల్లించకపోతే నోటీసులిచ్చి ఆ షాపును మరొకరికి అప్పగిస్తామని పొందుపరిచినట్లు అధికార వర్గాల సమాచారం. అప్పట్లో దుకాణాలను దక్కించుకున్న వారి పేర్లు కార్పొరేషన్ రికార్డుల్లో మాత్రమే దర్శనమిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో చూస్తే 70 శాతం మంది బయటి వ్యక్తులే దుకాణాల్లో దర్శనమిస్తున్నారు. షాపు దక్కించుకుని, బయటి వ్యక్తులకు ఎక్కువ అద్దెకు ఇచ్చేశారనే ఆరోపణలు ఉన్నాయి. నగర నడిబొడ్డులో ఉండటం, వాణిజ్య పరంగా డిమాండ్ ఉండటంతో ఒక్కో దుకాణానికి రూ. లక్షల్లో అడ్వాన్స్‌లు తీసుకుంటూ, నెలకు రూ. 15 వేల నుంచి రూ. 20 వేల వరకూ అద్దెలు తీసుకుంటూ బయటి వ్యక్తుల అప్పగించారన్న విమర్శలున్నాయి. ఎవరైనా అధికారులు తనిఖీల కెళ్లినప్పుడు వారంతా తమవారే అంటూ అధికారులను బురిడీ కొట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



కలెక్టరేట్ పక్కన గల ఎస్సీ కార్పొరేషన్ దుకాణాలు

పరిశీలిస్తున్నాం



నగరంలోని ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లలో కొంత మంది అద్దెలు సక్రమంగా చెల్లించడం లేదు. ఇటీవల మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్‌కుమార్ షాపులను పరిశీలించిన సందర్భంలో ఈ విషయం బయటపడింది. బినామీలు ఉన్న విషయం నా దృష్టికి రాలేదు. అయితే వీటన్నింటిని పరిశీలిస్తున్నాం. నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతాం.


- రాధిక, ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ ఈడీ

జట్కావాలా..

గుర్రపు డెక్కల శబ్దం
వినిపించినా..
జట్కా బండి వచ్చి.. ఆగినా..
ఊరి జనం చూపంతా.. అటే..
వారి కళ్లన్నీ బండిపైనే..
అందులోంచి దిగేవారు..
రాజ కుటుంబీకులో..
భూసాములోనని..
ఆతృతగా చూసేవారు..
ఆ తీవి వేరు..
గత వైభవానికి గుర్తుగా..
ధర్మవరంలో ఓ జట్కా బండి..
నేటికీ తిరుగుతోంది..
ఆంగ్లేయులను
మెప్పించిన బండి అంటూ..
మురిసిపోతున్నాడు యజమాని..
80 ఏళ్ల జట్కా స్టాండు స్మృతులను
నెమరు వేసుకుంటున్నాడు..
80 బండ్లున్న స్టాండులో
ఒంటరిగా
మిగిలిపోయాడు..
భారంగా బండి
నడుపుతున్నాడు..
జట్కావాలా..
మహబూబ్ బాషా..

బ్రిటిష్ పాలన రోజుల్లో ప్రయాణాలు చేసేందుకు ధనికులు, భూస్వాములు జట్కా బండ్లను వాడేవారు. కాలక్రమేణా ఆ జట్కాబండి కనుమరుగైపోయింది. ధర్మవరం పట్టణంలో మాత్రం నేటికీ జట్కాబండి తిరుగుతోంది. పట్టణ నడిబొడ్డున ఉన్న జట్కా స్టాండు ఒకప్పుడు ఓ వెలుగు వెలిగింది. 1945లో సుమారు 80 జట్కాబండ్లతో పాత బస్టాండు అంజుమన్ సర్కిల్ సమీపంలో ఏర్పాటు చేసుకున్నారు. నేటికీ జట్కాస్టాండుగా ఎంతో గుర్తింపు ఉంది. జట్కా స్టాండు 80ఏళ్లు పూర్తి చేసుకుంటోంది. జట్కా బండి నిర్వాహకుడు మహబూబ్‌బాషా మాట్లాడుతూ.. తమ కుటుంబానికి జట్కాబండి జీవనాధారం అంటున్నారు. తన తాత అలామ్‌సాబ్, ఆ తర్వాత తన తండ్రి సత్తార్ సాహెబ్ జట్కాబండితో కుటుంబాన్ని పోషించేవారని గుర్తు చేసుకున్నారు. తాను కూడా 60 ఏళ్లుగా జట్కాబండితో కుటుంబాన్ని పోషించుకుంటున్నానని చెబుతున్నారు. అప్పట్లో జట్కాబండ్లకు చాలాగిరాకీ ఉండేదనీ, ఇందులో వెళితే ఎంతో గొప్పగా భావించేవారన్నారు. అప్పట్లో అనాలు, పైసలు తీసుకుని, గమ్యస్థానాలకు చేర్చేవారమని గుర్తు చేసుకున్నారు. ఆ తర్వాత రూ.2కే సుమారు 20 కిలోమీటర్ల వరకు తీసుకెళ్లేవారమన్నారు. అప్పట్లో తీరికలేకుండా గిరాకీ ఉండేదనీ, స్టాండులో 80 బండ్ల వరకు పెట్టుకుని జీవనం సాగించేవారమన్నారు. జిల్లాలోనే ధర్మవరంలో అత్యధికంగా జట్కాబండ్లు ఉండేవంటున్నారు. అప్పట్లో రైల్వేస్టేషన్ నుంచి ధర్మవరంలోకి రావాలంటే జట్కాబండిని తప్పనిసరిగా ఎక్కేవారు. కాలక్రమేణా ఆటోలు, రిక్షాలు, ద్విచక్రవాహనాలు రావడంతో జట్కా బండ్లు ఎక్కేవారే కరువయ్యారు. దీంతో సరుకులను పట్టణంలోని పలు ప్రాంతాలకు రవాణా చేస్తూ.. పొట్ట నింపుకుంటున్నానని మహబూబ్ చెబుతున్నారు. పెద్దగా గిరాకీ లేకపోయినా.. తరాల నుంచి చేస్తున్న పని కావడంతో వదులుకోలేకపోతున్నానని ఆయన వివరిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, ధర్మవరం రూరల్





జట్కా బండి నిర్వాహకుడు మహబూబ్ బాషా



పులకుర్తి గ్రామంలో పనులను పరిశీలిస్తున్న అధికారులు

పల్లె దారి.. పరుగు

పటిష్టంగా సిమెంట్ రోడ్లు

బురద బాధ తప్పుతుందని జనం హర్షం

డి.హీరేహాళ్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): అడుగడుగునా గుంతలమయమైన రహదారులకు మహర్దశ కలిగింది. వైసీపీ ఐదేళ్ల పాలనలో రోడ్లన్నీ గుంతలతో బురదమయంగా మారాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక గత మూడునెలలుగా గ్రామాల్లో రోడ్ల నిర్మాణం పరుగులు పెడుతోంది. నూతన రోడ్ల నిర్మాణంతో గ్రామీణ దారులు కళకళలాడుతున్నాయి. దీంతో గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డి.హీరేహాళ్ మండల వ్యాప్తంగా 16 గ్రామ పంచాయతీల్లో 31 పల్లెలు ఉన్నాయి. గత మూడునెలల కాలంలో మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో 76 సిమెంట్ రోడ్లకుగాను రూ. 3 కోట్లకుపైగా నిధులతో పనులు చేపట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక గ్రామానికి రూ. 20 లక్షల నుంచి రూ. 30 లక్షలు వెచ్చించి నూతన రోడ్లను నిర్మించారు. ఇందులో ముఖ్యంగా వసగుడ్డం గ్రామచరిత్రలో ఒకేసారి రూ. 10 లక్షలకు మించి అభివృద్ధి పనులను చేపట్టలేదు. ఆ గ్రామంలో చాలా ఏళ్లగా దారులు, మురికి కాలువలుగా మారిపోవడంతో గ్రామస్థులు, నాయకులు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన వెంటనే ఆ ఒక్క గ్రామానికే రూ. 25 లక్షలు నూతన రోడ్ల నిర్మాణానికి మంజూరు చేయించారు. వెంటనే పనులు మొదలుపెట్టి పూర్తి చేశారు. గతంలో మురికిమయంగా మారిన దారులు.. ప్రస్తుతం వీధులన్నీ నూతన రోడ్లతో కళకళలాడుతున్నాయి.



సోమలాపురంలో పూర్తయిన సిమెంట్ రోడ్డు

అడిగిన వెంటనే మంజూరు



డి.హీరేహాళ్ గ్రామంలో చాలా ఏళ్లుగా రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వైసీపీ ప్రభుత్వంలో కూడా అధికారులను రోడ్ల విషయమై విన్నవించుకున్నా పట్టించుకోలేదు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో రోడ్లకు నిధులు మంజూరు చేయించారు. దీంతో పనులు పూర్తి రోడ్లను ప్రారంభించారు. నూతన రోడ్లతో వీధులు కళకళలాడుతున్నాయి.

- నాగళ్ల రాజు, డైరెక్టర్, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం



గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. వైసీపీ పాలనలో గ్రామాల్లో ఎక్కడ చూసినా బురదమయంగా ఉన్న రోడ్లను ఎన్నికల ప్రచారంలో పరిశీలించాం. గ్రామీణులు రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రహించి ఎమ్మెల్యే చొరవ చూపారు. ఇందులో భాగంగానే ప్రతి గ్రామంలోనూ రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షల వ్యయంతో నూతన రోడ్లను ఏర్పాటు చేస్తున్నాం. రాబోవు రోజుల్లో మరిన్ని సిమెంట్ రోడ్ల నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

- హనుమంతరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్

డ్రోన్ సేద్యం.. ఉపాధి మార్గం..

- యువకుడి వినూత్న ఆలోచన
- డ్రోన్ సాయంతో పంటలకు మందుల పిచికారీ
- సమయం, డబ్బు ఆదా అంటున్న నాగమునీంద్ర

యల్లనూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): అగ్రికల్చర్ డిప్లొమో కోర్సు చదివిన యువకుడు వినూత్న ఆలోచన చేశాడు. సేద్యానికి సాంకేతిక సాయం అందించాలనుకున్నాడు. డ్రోన్ సేద్యాన్ని ఎంచుకున్నాడు. రైతులకు సమయం, డబ్బు ఆదా చేయడంతోపాటు తానూ ఉపాధి పొందుతున్నాడు యల్లనూరుకు చెందిన అచ్యుత నాగమునీంద్ర. యువకుడి చిన్నతనంలోనే తండ్రి నారాయణస్వామి మరణించాడు. తల్లి తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్నారు. నాగమునీంద్ర అగ్రికల్చర్ డిప్లొమో కోర్సు చేశాడు. ఉద్యోగం చేయడం ఇష్టంలేక స్వయం ఉపాధి మార్గాన్ని ఎంచుకున్నాడు. అందులో భాగంగా విజయవాడలో డ్రోన్ వినియోగంపై శిక్షణ తీసుకున్నాడు. సాధారణంగా రైతులు వరి, అరటి, మొక్కజొన్న, పప్పుశనగ తదితర పంటలపై క్రిమిసంహారక మందులు పిచికారీ చేయాలంటే ఇబ్బందులు పడేవారు. పంటలపై తొక్కుకుంటూ పిచికారీ చేసేవారు. మరి కొన్నిచోట్ల ట్రాక్టర్లతో సైతం పిచికారీ చేసేవారు. ఈ కష్టాలకు చెక్ పెడుతూ.. నాగమునీంద్ర డ్రోన్ సేద్యాన్ని ఎంచుకున్నాడు. సుమారు రూ.6లక్షలతో డ్రోన్‌ను కొనుగోలు చేశాడు. తద్వారా పంటలకు మందులు పిచికారీ చేస్తున్నాడు. ఎకరాలో పిచికారీకి మనుషుల సాయంతో 30 నిముషాల సమయం పట్టేది. డ్రోన్ ద్వారా 5 నిమిషాల్లోనే పూర్తి చేస్తున్నాడు. మందుల పిచికారీకి ఎకరాకు 75నుంచి 90లీటర్ల నీరు అవసరం. డ్రోన్ ద్వారా 10లీటర్ల నీరు చాలని నాగమునీంద్ర చెబుతున్నాడు. పురుగు మందులు కూడా 20శాతం ఆదా కావడంతో పాటు డబ్బు మిగులుతోందని రైతులు చెబుతున్నారు. డ్రోన్ ద్వారా ఎకరాలో పిచికారీకి రూ.500 అద్దె తీసుకుంటున్నాడు. వరిపొలాల్లో మనుషుల ద్వారా పిచికారీ చేయాలంటే రూ.600 నుంచి రూ.800 వరకు ఖర్చవుతుంది. రైతులు నీరు మోస్తూ శ్రమించాల్సి ఉంటుంది. డ్రోన్‌తో అయితే ఆ శ్రమ కూడా ఉండదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు, డ్రోన్ వినియోగంపై పరిసర ప్రాంతాల రైతులకు అవగాహన సైతం కల్పిస్తున్నానని నాగమునీంద్ర చెబుతున్నాడు. ఫలితంగా రైతులే నేరుగా ఫోన్ చేసి, మందులు పిచికారీ చేయాలని కోరుతున్నారట. ఈ విధానంతో డబ్బు ఆదా అవడంతోపాటు శ్రమ కూడా తగ్గుతుండడంతో రైతులు డ్రోన్ ద్వారా పిచికారీపై మక్కువ చూపుతున్నారు.





ద్విచక్రవాహనంలో వెళ్తున్న నాగమునీంద్ర



నాగ మునీంద్ర

ఔరా.. గిజిగూడు..!





ఈత చెట్టుపై గిజిగాడు ఏర్పాటు చేసుకున్న గూళ్లు

చిటారు కొమ్మకు వేలాడే..
ఇల్లు కట్టుకున్నావు..
ఇంజనీరువు కావు..

లోపలికెళ్లేందుకు
ప్రత్యేక ద్వారం
పెట్టుకున్నావు..
మేస్త్రీవి కావు..


గడ్డి పోచలతో..
నార పాసలతో..
అందమైన బొమ్మరిల్లు
అల్లుకున్నావు..
చెయ్యి తిరిగిన
కళాకారుడివి కావు..

కోట్లు పెట్టి కట్టిన..
భవంతులే కూలుతున్నాయి..
నీ ఇల్లు మాత్రం
చెక్కు చెదరదు..

ఏంటో ఆ నైపుణ్యం..
కాస్త.. చెప్మా..
గిజిగాడా..

చిలమత్తూరు మండలంలోని కొడికొండ చెక్‌పోస్టు సమీపాన ఈత చెట్టులో పెద్ద సంఖ్యలో గిజిగాడు పక్షులు గూళ్లను నిర్మించుకున్నాయి. ఇంజనీర్లను సైతం ఆలోచింపజేసేలా నిర్మాణాలు చేసుకోవడమే విశేషం. ఇతర పక్షులు గంప ఆకారంలో గూళ్లను నిర్మించుకుంటాయి. గిజిగాడు మాత్రం ఒకచోట మాత్రమే ద్వారం ఉండేలా చూసుకుంటుంది. మిగిలిన చోట్లలో కనీసం చీమ కూడా గూడు లోపలికి చొరబడలేని విధంగా మామూలు గడ్డిపోచలతో గూడును ఏర్పాటు చేసుకుంటుంది. అదే గిజిగాడి గొప్పతనం. ప్రకృతి అద్భుతం.

- చిలమత్తూరు, ఆంధ్రజ్యోతి



సాగులో ఉన్న పొగాకు పంట

చీడపీడలు తక్కువ

అగ్రిమెంట్ మేరకు ధర

ఆసక్తి చూపుతున్న రైతులు



దండలుగా కూర్చి ఆరబెట్టిన పొగాకు

పొగాకే మేలు..!

పెద్దవడుగూరు మండలంలో పత్తి, మిరప తదితర పంటల సాగుతో ఆర్థికంగా నష్టపోయిన రైతులు ఈ సారి పొగాకు పంటను సాగు చేశారు. ఈ పంటకు చీడపీడలు ఆశించకపోవడం, పలు ప్రైవేట్ కంపెనీలే ముందస్తు ధర నిర్ణయించి దిగుబడిని కొనుగోలు చేస్తుండటంతో రైతులు ఈ పంట సాగు వైపు మొగ్గు చూపారు. పెద్దవడుగూరు, లక్షుంపల్లి, చిన్నవడుగూరు గ్రామాల్లో 152 హెక్టార్లలో పంటను సాగుచేశారు. - ఆంధ్రజ్యోతి, పెద్దవడుగూరు



పొగాకు బేళ్లు

పంట సాగు, విక్రయం ఇలా..

పొగాకు పంట సాగు కోసం రైతులు నంద్యాల, బనగానపల్లి, నెల్లూరు ప్రాంతాల నుంచి నారును కొనుగోలు చేశారు. ఎకరా విస్తీర్ణంలో పంట సాగు చేయాలంటే 10వేల మొక్కలు అవసరమవుతాయి. ఒక్కో మొక్కకు రవాణా ఖర్చుతో కలుపుకొని రూ.2చొప్పున వెచ్చిస్తున్నారు. మరికొందరు బోరుబావి గల రైతులు కిలో విత్తనాలను రూ.600చొప్పున కొనుగోలు చేసి తమ పొలాల్లో నారు వేసుకొని పంట సాగు చేస్తున్నా రు. నారు నాటిన తర్వాత మూడు నెలలకు పొగాకు పక్వానికి వస్తుంది. అప్పుడు కూలీల సాయంతో మొక్క నుంచి ఆకును వేరు చేస్తారు. వాటిని దండలుగా కూర్చి కట్టెలతో ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్లలో 15రోజుల పాటు ఎండబెడతారు. అనంతరం పొగాకు బేళ్లుగా ఏర్పాటు చేసి క్వింటా రూ.15500 చొప్పున ముందస్తుగా ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీలకు విక్రయిస్తారు. ఎక్కువ మంది బనగానపల్లిలో ఉన్న ఐటీసీ కంపెనీకి తరలిస్తున్నారు. ప్రస్తుతం ఎకరాకు ఏడు క్వింటాళ్ల నుంచి 12క్వింటాళ్ల మేర దిగుబడి వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. కాగా ఎకరానికి దాదాపు రూ.70వేల దాక పెట్టుబడి అవుతుందని వారు పేర్కొన్నారు.

ముందస్తు ఒప్పందంతోనే ఆసక్తి



రెండెకరాల పొలంలో పొగాకు పంటను సాగుచేశా. కొన్ని కంపెనీలు ముందస్తు అగ్రిమెంట్ ధర నిర్ణయించడంతో పంట సాగుపై ఆసక్తి కలిగింది. ప్రస్తుతం ఎకరాకు 8 క్వింటాళ్ల మేర దిగుబడి వచ్చింది. పంట సాగు మొదలు నుంచి ఇప్పటివరకు రెండెకరాలకు కలిపి రూ.1.4లక్షలు పెట్టుబడి పెట్టా. ఇంకా దిగుబడి వచ్చే అవకాశం ఉంది. వచ్చిన దిగుబడిని బనగానపల్లిలో ఉన్న మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నాం. -రంగనాయకులు, పెద్దవడుగూరు

దిగుబడి బాగా వచ్చింది

ఈ ఏడాది పొగాకు పంట సాగు చేయగా దిగుబడి ఆశించినస్థాయిలో ఉంది. గతంలో సాగుచేసిన పంటల్లో లాభాలు రాకపోవడంతో 5ఎకరాల్లో పొగాకు పంట వేశా. ఈ పంట సాగుకు చీడపీడలు తక్కువైనా కూలీలు అధికంగా కావాల్సి ఉంటుంది. ఇప్పటివరకు 10క్వింటాళ్ల మేర దిగుబడి వచ్చింది. పంట మొత్తం మూడు నుంచి నాలుగు కోతలు కోస్తాం. మొదటి, రెండు కోతల్లో కోసిన పంటకు క్వింటా రూ.15500 ఉండగా చివరి కోత మాత్రం నాణ్యతను బట్టి ధరను నిర్ణయిస్తారు. - ఓబుల్‌రెడ్డి, లక్షుంపల్లి

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

ఈలపాట రఘురామయ్య (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత ఈలపాట రఘురామయ్యగా పేరొందిన కల్యాణం వెంకట సుబ్బయ్య 1901 మార్చి 5న గుంటూరు జిల్లా సుద్దపల్లి గ్రామంలో జన్మించారు. చిన్నతనం నుంచి నాటకాలు వేశారు. ప్రత్యేకించి రఘురాముని పాత్ర వేయడంలో రాణించడం కాశీనాథుని నాగేశ్వరరావు ఆయనను రఘురామయ్యగా పిలిచారు. సుప్రసిద్ధ రంగస్థల, సినిమా నటుడు, గాయకుడుగా పేరొందారు. నాటకాలలో ఈలవేసి పద్యాలు, పాటలు పాడి శ్రోతలను మంత్రముగ్ధులు చేసేవారు. దీంతో ఈయన 'ఈలపాట రఘురామయ్య'గా గుర్తింపు పొందారు. రవీంద్రనాథ్ ఠాగూర్ ఆయనను 'నాటక కోయిల'గా ప్రశంసించారు. సంగీత నాటక అకాడమీ ఇతర పురస్కారాలు అందుకున్నారు. 1975 ఫిబ్రవరి 24న కన్నుమూశారు.

గంగూబాయి హానగల్ (జయంతి)



గంగూబాయి హానగల్ 1913 మార్చి 5న కర్ణాటక రాష్ట్రం ధారవాడలో జన్మించారు. కిరాణా ఘరానా శైలి హిందూస్తానీ సంగీత విద్వాంసురాలు. దత్తోపంత్ దేశాయ్ వంటి గురువుల వద్ద శిక్షణ పొంది 'లేడీ ఆఫ్ ఖయాల్'గా పేరొందారు. కర్ణాటక యూనివర్సిటీలో సంగీతం గౌరవ ప్రొఫెసర్‌గా వ్యవహరించారు. ఆలిండియా రేడియోలోనూ ఆమె ప్రదర్శనలు ఇచ్చారు. 2006లో చివరి కచేరీ ప్రదర్శించారు. పద్మభూషణ్, పద్మ విభూషణ్, సంగీత నాటక అకాడమీ అవార్డు తదితర అవార్డులు అందుకున్నారు. 2009 జూలై 21న కన్నుమూశారు.

బిజూ పట్నాయక్ (జయంతి)



బిజు పట్నాయక్ 1916 మార్చి 5న ఒడిశా రాష్ట్రం కటక్ ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు బిజయానంద్ పట్నాయక్. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో ప్రైవేట్ విమానంలో పైలట్‌గా పని చేశారు. తర్వాత రాయల్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో చేరారు. తర్వాత రాజకీయాల్లో రాణించి కాంగ్రెస్‌లోనూ, జనతాదళ్ పార్టీలలో వివిధ హోదాలలో రాణించారు. ఒడిశా రాష్ట్రానికి రెండుసార్లు ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. కేంద్రమంత్రిగానూ వ్యవహరించారు. 1997 ఏప్రిల్ 17న కన్నుమూశారు.

మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి (జయంతి)



మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి 1920 మార్చి 5న కోనసీమ జిల్లా అమలాపురం తాలూకా ఐలెండు పోలవరం గ్రామంలో జన్మించారు. తెలుగు సాహిత్యంలో పేరొందిన కవులలో ప్రముఖులు. ఆంధ్ర కల్హణ, కళాప్రపూర్ణ బిరుదాంకితులు. పదో యేటనే పద్యాలు రాయడం మొదలుపెట్టిన ఘనత ఆయనది. 1938లో తొలి ఖండకావ్యం తోరణము వెలువడింది. భాషపై అభిమానంతో 'ఆంధ్రి' మాసపత్రికను ప్రారంభించారు. ఇందులో ఎంతోమంది కవులు, రచయితలు, పండితుల రచనలు ముద్రించబడ్డాయి. కాగా ఆయన రచించిన 'ఆంధ్ర పురాణం' కృతికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు దక్కింది. 1992 నవంబరు 7న కన్నుమూశారు.

వి కోటేశ్వరమ్మ (జయంతి)



వేగా కోటేశ్వరమ్మ 1925 మార్చి 5న కృష్ణాజిల్లా గోసాల గ్రామంలో జన్మించారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా పేరొందారు. 1940 దశకంలో విజయవాడ తాలూకాలో తొలి పట్టభద్రురాలు కావడం ప్రత్యేకత. మాంటిస్సోరి మహిళా విద్యాసంస్థల సంస్థాపకురాలు. 53కుపైగా పుస్తకాలు ప్రచురించారు. 92వ యేట 2017లో 'పద్మశ్రీ' పురస్కారం అందుకున్నారు. 2019 జూన్ 14న కన్నుమూశారు.

అలిక్ పదంసీ (జయంతి)



అలిక్ పదంసీ 1928 మార్చి 5న ముంబైలో జన్మించారు. పలు ప్రతిష్ఠాత్మక ప్రకటనలకు సృష్టికర్త. దేశంలో అంతర్జాతీయ ప్రకటనల సంస్థ లింటాస్‌కు 1980 నుంచి 1994 వరకు చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా వ్యవహరించి ఆ సంస్థను అగ్రశ్రేణి ప్రకటనల సంస్థగా తీర్చిదిద్దారు. 1982లో చారిత్రాత్మక సినిమా 'గాంధీ'లో మహ్మద్‌అలీ జిన్నా పాత్రలో నటించి అందరి మన్ననలు అందుకున్నారు. తన 60ఏళ్ల కెరీర్‌లో 70కుపైగా నాటకాలకు దర్శకత్వం వహించారు. ఎవిటా, జీసస్ క్రైస్ట్ సూపర్‌స్టార్, తుగ్లక్ వంటి నాటకాలు ప్రాచుర్యం పొందాయి. 2018 నవంబరు 17న కన్నుమూశారు.

వన్యప్రాణులకు ట్యాంకర్లతో నీరు



నాగరహొళె పులుల అభయారణ్య ప్రవేశద్వారం

బెంగళూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మార్చి ప్రారంభమయ్యేసరికే రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. చెరువులు, వాగులు, వంకలలో నీటిమట్టం తగ్గిపోతోంది. ఫిబ్రవరి రెండోవారం నుంచే ఎండలు పెరగడంతో నీటి సమస్యలు మొదలయ్యాయి. మైసూరు, కొడగు జిల్లాల పరిధిలోని నాగరహొళె అటవీప్రాంతంలో చెరువుకట్టలు, కుంటలలో నీరు ఇంకిపోవడంతో వన్యప్రాణులకు తాగునీటికి సమస్య నెలకొంది. ముందుగానే గమనించిన అటవీశాఖ అధికారులు ట్యాంకర్ల ద్వారా పలు చోట్ల కుంటలలో నీటిని నిల్వ ఉంచుతున్నారు. పగటి వేళల్లో కుంటలలో నీరు నిల్వ ఉంటే రాత్రిళ్ల వన్యప్రాణులు దాహం తీర్చుకుంటాయని అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. నాగరహొళె పులుల సంరక్షణా కేంద్రానికి అనుబంధంగా కబిని, తారక జలాశయాలు ఉన్నాయి. అటువైపు వెళ్లలేని వన్య ప్రాణులకోసం పలు చోట్ల నీటిని సిద్ధం చేసినట్టు డివిజినల్ ఫారెస్ట్ ఆఫీసర్ ఎస్ఎస్ సిద్దరాజు తెలిపారు. రైతుల బోరుబావులనుంచి నీటిని సేకరించి గుంతలు, చెరువులలో నిల్వ ఉంచుతున్నామన్నారు. గతంలోనూ ఇలాంటి నీటి నిల్వలు కొనసాగించినట్టు తెలిపారు.



ట్యాంకరు ద్వారా నీటి విడుదల

ఘనంగా చౌడేశ్వరీదేవి బ్రహ్మరథోత్సవం



పురవీధుల్లో రథోత్సవం



అమ్మవారి మూలవిరాట్టుకు అలంకరణ

ముళబాగిలు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని విరూపాక్షి గ్రామంలోని పురాణ ప్రసిద్ధమైన చౌడేశ్వరిదేవి ఆలయ 19వ వార్షికోత్సవం, మూడో బ్రహ్మరథోత్సవ కార్య క్రమాలు ఘనంగా జరిగాయి. మంగళవారం ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, 108 సుమంగళిలచే లలితా సహస్రనామ పారా యణతో కుంకుమార్చన కుంభాభిషేకం, మహా మంగళారతి కార్యక్రమాలు సాగాయి. ఉత్సవ మూర్తికి విశేషపూజలు అనంతరం వేదపండితుల పఠనం, వాద్యగోష్ఠి నడుమ రథంపై కొలువు దీర్చారు. పురవీధులలో రథోత్సవం సాగింది. భక్తులు రథంపై పూలు, పండ్లు, దవనం, ఉప్పు వేసి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవంలో భాగంగా ఆలయాన్ని పుష్పాలతో అందంగా తీర్చి దిద్దారు. ప్రధాన ఆగమికులు వెంకటేశాస్త్రి, గణేశ్ రావ్, అర్చకులు కృష్ణమోహన్ బృందంచే ధార్మిక కైంకర్యాలు సాగాయి. కళాకారుల కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. భక్తాదులకు అన్నసంతర్పణ నిర్వహించారు. ఆలయ మేనేజర్ నారాయణస్వామి, గ్రామపంచాయతీ ఉపాధ్యక్షు రాలు లక్ష్మీదేవమ్మ, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

క్షయ రోగులకు పౌష్టికాహారం అందజేత



ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశా కార్యకర్తలు తదితరులు

దొమ్మసంద్ర, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ద్మసంద్రలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ ప్రాంతీయ డైరెక్టర్ బెంగళూరు కేంద్రం డాక్టర్ షణ్ముగం సందర్శించి క్షయ తదితర రోగులలో ధైర్యం నింపారు. క్షయ రోగులకు పౌష్టికాహారాన్ని అందచేసి అభినందించారు. అనారోగ్యానికి గురైతే మీలోని స్థైర్యం, ధైర్యం కోల్పోకుండా ఉండాలని తద్వారా ఎంతపెద్ద అనారోగ్యమైనా ఎదుర్కొనే శక్తి మీలో ఉందన్నారు. దొమ్మసంద్ర శాఖ వైద్యులు భరత్ మాట్లాడుతూ తమ పరిధిలోని అన్ని పల్లెల్లో ఆశాకార్యకర్తలు సందర్శించి క్షయ రోగాన్ని గుర్తించే చర్యలు చేపడుతున్నారన్నారు. రోగముక్త సమాజం గ్రామాన్ని తీర్చిదిద్దడమే తమ కర్తవ్యమన్నారు. డాక్టర్ హేమామాలిని మాట్లాడుతూ టీబీ రోగ నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో కార్యక్రమాలు ఉన్నాయన్నారు. ఇళ్ల చుట్టుపక్కల స్వచ్ఛత పాటించాలని, దోమల బెడదకు అవకాశం లేకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్యకేంద్ర అధికారి శ్రీనివాస్, చందాపుర క్షయరోగ విభాగం దేవప్ప, అసిస్టెంట్ రిజిస్ట్రార్ బద్రినాథ్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాగి కొనుగోలు కేంద్రం ప్రారంభం

దొడ్డబళ్ళాపుర, మార్చి 4(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ఏపీఎంసీ మార్కెట్‌లో రాగి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజ్ లాంఛనంగా ప్రారంభించారు. మంగళవారం ఏర్పాటైన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నమోదు చేసుకున్న రైతులు తమ రాగిపంటను ఇక్కడ విక్రయించుకోవచ్చునన్నారు. క్వింటాల్ రాగికి రూ.4290గా ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిపారు. ప్రతిరైతు నుంచి 20 క్వాంటాళ్ల కొనుగోళ్లకు అవకాశం ఉందన్నారు. రాగి ఖరీదు కేంద్రం అధికారి హెచ్ఎన్ నారాయణ్ మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి కనీస మద్దతు ధర ప్రకారం రాగి కొనుగోలు చేసేందుకు బెంగళూరు గ్రామీణ జిల్లా 4 తాలూకాలలో కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. దొడ్డబళ్ళాపురలో 12,875మంది రైతులు నమోదు చేసుకున్నారన్నారు. మొత్తం 182728.05 క్వింటాళ్ల రాగి కొనుగోలుకు అవకాశం ఉందన్నారు. కేంద్రానికి వచ్చే రైతులు తమ నమోదుపత్రాన్ని తేవాలన్నారు. తప్పనిసరిగా బయోమెట్రిక్ ఉంటుందన్నారు. వారంలోగా ప్రతి రైతుకు ఫోన్ చేసి సమాచారం ఇస్తారని, తద్వారా తాలూకా రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నగరసభ అధ్యక్షురాలు సుమిత్రి ఆనంద్, పౌర ఆహార సరఫరాలశాఖ డిప్యూటీ డైరెక్టర్ శంకర్‌మూర్తి, జిల్లా మేనేజర్ తన్వీర్ ఆలి తదితరులు పాల్గొన్నారు.



రాగి కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే తదితరులు

కమిటీకి ఐదుగురి ఏకగ్రీవ ఎన్నిక

శిడ్లఘట్ట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ఆనూరు గ్రామ పాల ఉత్పత్తిదారుల సంఘం కమిటీకి ఐదుగురు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో తమకు మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ నాయకుడు పుట్టు ఆంజినప్పను మర్యాదపూర్వకంగా భేటీ అయి సత్కరించారు. చిక్కణ్ణమూర్తి, నరసింహమూర్తి, దేవరాజ్, నటరాజ్, వెంకటస్వామి, దేవరాజ్, చంద్రప్ప, లతా దేవరాజ్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



పుట్టు ఆంజినప్పతో పాలసంఘం పదాధికారులు



కాలనీ సమీపంలోని గుట్టపై దగ్ధమవుతున్న వృక్షాలు

గుట్టపై చెలరేగిన మంటలు

రాయచూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆశాపూర్ రోడ్డు పద్మావతి కాలనీ సమీపంలోని గుట్ట పై సోమవారం రాత్రి ఆకస్మికంగా మంటలు చెలరేగాయి ఒక్కసారిగా మంటలు గుట్ట చుట్టూ వ్యాప్తి చెందడంతో గుట్ట పై వెలసిన చెట్లు ఇతర వస్తువులకు నిప్పంటుకుంది. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు. అదృష్టవశాత్తు కాలనీ పరిసరాల్లోకి మంటలు వ్యాపించకపోవడంతో నష్టం జరగలేదు. స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

పకడ్బందీగా పది పరీక్షలు: ఆర్జేడీ



శిక్షణలో మాట్లాడుతున్న డీఈఓ కిష్టప్ప

బుక్కపట్నం, మార్చి4(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కడప ఆర్జేడీ శామ్యూల్ అధికారులను ఆదేశించారు. మండలకేంద్రంలోని డైట్ కళాశాలలో మంగళవారం పది పరీక్షలపై జిల్లా చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంట్ అధికారులు, జిల్లా విద్యాధికారులకు శిక్షణ నిర్వహించారు. ఆర్జేడీ మాట్లాడుతూ.. పరీక్షలు సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా విద్యాధికారులపై ఉంటుందన్నారు. పరీక్షల సమయంలో చుట్టు పక్కల జిరాక్స్ కేంద్రాలు, బుక్ సెంటర్లు మూసి వేయించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ కిష్టప్ప, పరీక్షల విభాగ అసిస్టెంట్ కమిషనర్ లాజర్, అసిస్టెంట్ డైరెక్టర్ రామక్రిష్ణ, డైట్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, డిప్యూటీ డీఈఓ పద్మప్రియ, ఎంఈఓలు పాల్గొన్నారు.

జిల్లాలో బాలింతల మరణాలకు

అడ్డుకట్ట వేయాలి: కలెక్టర్

రాయచూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసూతి మరణాలు సంభవించకుండా ముఖ్యంగా బాలింతల మరణాలు పూర్తిగా నియంత్రించేందుకు అధికారులు నిబద్ధతతో కృషి చేయాలని జిల్లాధికారి నితీశ్ సూచించారు. నగరంలోని మాతా, శిశు సంక్షేమ ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన ప్రసూతి అవగాహన కార్యక్రమాన్ని జిల్లాధికారి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన జిల్లాధికారి నితీశ్, ప్రభుత్వ ఆస్పత్రుల్లో లభించే అన్ని రకాల వైద్య సేవలు సర్కారి ఆస్పత్రుల్లోనే లభించేలా సంబంధిత శాఖ అధికారులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఇందుకు ప్రభుత్వ ఆస్పత్రులకు వైద్యులకు ప్రభుత్వ పరంగా పూర్తిస్థాయి తోడ్పాటు అందేలా తాము కృషి చేస్తామన్నారు. జిల్లా ఆస్పత్రి సర్జన్ డాక్టర్ విజయ శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రులకొచ్చే రోగులకు ముఖ్యంగా ప్రసూతి కోసం వచ్చే వారికి మరింత మెరుగైన వైద్యసేవలందించేందుకు ఆస్పత్రి సిబ్బంది ముఖ్యంగా నర్సింగ్ స్టాఫ్ తగిన జాగ్రతలు తీసుకోవాలన్నారు. రోగుల పట్ల ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. తక్షణమే వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్, డీహెచ్ఓ పాల్గొన్నారు.

క్రీడలతో ఒత్తిడిని జయించాలి

- జడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండ్వె

రాయచూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): వృత్తి జీవితంలో ఒత్తిడికి గురైయ్యే ప్రభుత్వ ఉద్యోగులు క్రీడా పోటీల్లో భాగస్వాములు కావడం వల్ల ఒత్తిడిని జయించి మానసికంగా స్థిరత్వం సాధించాలని జడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండ్వె అన్నారు. మంగళవారం నగరంలోని మహాత్మగాంధీ స్టేడియంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, జిల్లా యంత్రాంగం, జడ్పీ, క్రీడలు, యువజన సర్వీసు శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగుల క్రీడాపోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన జడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండ్వె, క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల ఉద్యోగుల మధ్య వ్యక్తిగత సంబంధాలు బలపడే అవకాశం ఉంటుందన్నారు. దీంతో పాటే అన్ని శాఖలకు చెందిన ఉద్యోగుల మధ్య మరింత సమన్వయం ఏర్పడడం ద్వార పాలనపరంగా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించవచ్చన్నారు. తద్వార సుపరిపాలనకు బాటలు వేయగలమన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు కబడ్డీ, ఖోఖో, వాలిబాల్, లాంగ్ జంప్, హై జంప్, త్రోబాల్, చస్ వంటి పోటీలను నిర్వహించగా ఉద్యోగులు ఉత్సాహంగా భాగస్వాములయ్యారు.

నైపుణ్య కోర్సుల్లో రాణించిన విభిన్న ప్రతిభావంతులు



పట్టాలు పొందిన విభిన్న ప్రతిభావంతులు

బెంగళూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): బుద్ధిమాంద్యం కల్గిన విద్యార్థులకు నైపుణ్య కోర్సులలో శిక్షణ ఇవ్వడం సంతోషకరమని కేరళ డీజీపీ డాక్టర్ సంజీబ్ పఠజోషి అభిప్రాయపడ్డారు. శేషాద్రిపురం డిగ్రీ కళాశాలలో ప్రాక్రమిక వృత్తిపరసంస్థ, ముదిత క్రియేటివ్ స్కూల్ సాయంతో ఇటీవల శిక్షణలు పొందిన వారికి మంగళవారం పట్టాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కేరళ డీజీపీ సంజీబ్ పఠజోషి మాట్లాడుతూ బుద్ధిమాంద్యం కల్గినవారు వ్యక్తిగత పనులు చేసుకోలేరని, అయితే వారు ఎంత నేర్చుకుంటే అంతలోనే మార్పు తీసుకురావాలనే దిశలో ప్రయత్నించడం శుభ పరిణామమన్నారు. గాంధీ స్మారక ట్రస్టు వ్యవస్థాపకులు ఉడే పి కృష్ణ మాట్లాడుతూ నైపుణ్యత కల్పించాలనేది అన్ని విద్యాసంస్థల లక్ష్యమని అయితే సమాజంలో భిన్నమైనవారికి తగిన సహకారం అందించాలనే ఆలోచన స్ఫూర్తిదాయకమన్నారు. బియాండ్ లేబుల్స్ అండ్ అకడమిక్ గైడ్ ఫర్ స్పెషల్ ఎడ్యుకేటర్స్ పేరిట ఉండే ప్రత్యేక పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రాక్రమిక సంస్థ డైరెక్టర్ గాయత్రి నరసింహన్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

సమగ్ర పురోగతి సాధించాలి



సంస్థ ఉపాధ్యక్షుడు లెవిజాయ్‌కు సన్మానం

బంగారుపేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): పిల్లలు పాఠాలకే పరిమితం కాకుండా పాఠ్యేతర కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా సమగ్ర పురోగతి సాధించాలని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని కేజీఎఫ్ మెయిన్‌రోడ్డు సంగమ కల్యాణమండపంలో ఎస్‌వీఆర్ గ్లోబల్ స్టాండర్డ్ పాఠశాల 2024-25 వార్షికోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్యకరమైన మనఃస్థితి అలవరుచుకోవాలన్నారు. అలాగే పిల్లల్లోని ప్రతిభను ప్రోత్సహించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చేయూత ఇవ్వాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందచేసి అభినందించారు. కార్యక్రమంలో ఎస్సై రాజణ్ణ, పురసభ మాజీ సభ్యుడు వైవి రమేశ్, ఇండియా డిజైన్ కంపెనీ ఉపాధ్యక్షులు లెవి జాయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలయ ముఖద్వారానికి విశేష పూజలు




ఆలయ ముఖద్వారం

చేళూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని నల్లగుట్టపల్లి గ్రామపంచాయతీ పరిధిలో పురాతన కొండికొండ గంగమ్మ దేవస్థానానికి చేళూరు నుంచి బాగేపల్లి మార్గంలో నూతనంగా ముఖద్వారం ఏర్పాటు చేశారు. మంగళవారం సాయంత్రం గణపతిపూజ, గంగపూజ, గోపూజ, పంచగవ్య రక్షణ బంధన కళశస్థాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ఉదయం అమ్మవారికి విశేషపూజలు, గణపతి హోమం, నవగ్రహ హోమం, గంగమ్మహోమం, వాస్తు హోమం జరుపనున్నారు. అనంతరం కుంభాభిషేకం ఉంటుంది. చిత్రదుర్గ బాగల్కోట పీఠాధిపతి బాలకృష్ణ గురూజీ, అవధూత వినయ గురూజీ, ఇమ్మడి సిద్ధరామేశ్వర మహాస్వాములు మహాద్వారాన్ని ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా హెలికేప్టర్‌చే పుష్పాభిషేకం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

స్థూలకాయంతోనే ఆరోగ్య సమస్యలు

బెంగళూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): స్థూలకాయంతో ఆరోగ్య సమస్యలకు కారణమని పోరాటం చేయాలని ప్రధానమంత్రి పిలుపు నేపథ్యంలో నోవా నార్డిస్క్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్, ఎంబసీ ఆర్ఇఐటి ఆధ్వర్యంలో ఆరోగ్య అభియాన వార్షికోత్సవం జరిపారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎన్ఎన్ ఇఎఫ్ ఫౌండర్ ట్రస్టీ విక్రాంత్ శ్రోతియా మాట్లాడుతూ ఎంబసీ మాన్యతాలో నోవా హెల్త్ ఆధ్వర్యంలో 5కే రన్‌తోపాటు ఏడాదికాలంగా స్థూలకాయంపై పోరాటం, పనిచేసే స్థలంలో ఆరోగ్యాన్ని పెంపొందించే విధానాలను పాటిస్తున్నామన్నారు. ఎంబసీ సీఈఓ రిత్విక్ భట్టాచార్‌జీ మాట్లాడుతూ ఆధునిక ఉద్యోగాలలో భిన్నమైన శ్రమ ఉందని, అయితే ఆరోగ్యాన్ని సంరక్షించుకునేందుకు ప్రతి ఉద్యోగికి చైతన్యం కల్పిస్తున్నామన్నారు. వివిధ కంపెనీల సీఈఓలు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1606.14	1,586.30
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	7,182	885
నీటి నిల్వ (టీఎంసీలు)	30.57	8.21

అడ్డుకున్నాడు.. అరెస్టయ్యాడు..

- బస్సు ప్రయాణానికి ఇబ్బంది కలిగించిన యువకుడు
- వీడియో వైరల్
- అరెస్ట్ చేసిన పోలీసులు



బస్సుకు అడ్డుగా బైక్ నడుపుతున్న యువకుడు

కంప్లి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): తన వెకిలి చేష్టలతో బస్సు ప్రయాణాన్ని అడ్డుకున్న యువకుడు కటకటాలపాలయ్యాడు. కురుగోడు పోలీస్ స్టేషన్ పరిధిలోని బైలూరు గ్రామానికి చెందిన ప్రకాష్ అనే యువకుడిని మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. కురుగోడు పోలీసులు తెలిపిన వివరాల మేరకు రెండు రోజులు క్రితం బళ్లారి, సిరుగుప్ప రోడ్డులో లక్ష్మీ నగర్‌క్యాంప్ నుంచి బైలూరు గ్రామానికి చెందిన ప్రకాష్ బళ్లారి నుంచి సిరుగుప్ప వైపు వెళ్తున్న కేఎస్ ఆర్టీసీ బస్సు ప్రయాణానికి ఇబ్బంది కలిగించాడు. బస్సు ముందు భాగంలో ద్విచక్రవాహనంపై డ్రైవింగ్ చేస్తూ బస్సుకు సైడ్ ఇవ్వకుండా రెండు కిలో మీటర్లు ప్రయాణం చేశాడు. అయితే ఈ దృశ్యాన్ని బస్సు ప్రయాణికులు కొందరు మొబైల్‌లో చిత్రీకరించి వైరల్ చేశారు. ఈ వీడియోను కురుగోడు ఎస్ఐ సుప్రీత్ పరిశీలించి, ద్విచక్రవాహనం నెంబర్ ఆధారంగా యువకుడిని గుర్తించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రయాణికులను ఇబ్బంది కలిగించినందుకు అరెస్ట్ చేశామన్నారు.



ప్రకాష్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు

13న ఫించన్ అదాలత్

బళ్లారి గాంధీనగర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి):కార్మిక భవిష్యత్ నిధి సంస్థ బళ్ళారి రీజినల్ కర్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పింఛన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రాంతీయ కార్యాలయం రిజినల్ భవిష్య నిధి కమిషనర్ కె.వెంకట సుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. బళ్ళారి, విజయనగర, కొప్పళ, చిత్రదుర్గ జిల్లా పింఛను దారులు ఎదుర్కొంటున్న సమస్యలకు సంబంధించి ఈ కార్యక్రమంలో అధికారుల దృష్టికి తీసుకురావచ్చని, ఈ మెయిల్ ద్వారా పీపీఓ నెంబరు, చిరునామా, మొబైల్ నెంబరు, ఎదుర్కొంటున్న సమస్యలను మార్చి 10లోగా పంపుకోవచ్చు. వివరాల కోసం 08392-268943 నెంబరుకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మద్దతు ధర కోసం 10న చలో బెంగళూరు

- మిర్చి రైతుల సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం
- రైతు, వ్యవసాయ కార్మిక పోరాట కమిటీ

బళ్లారి సిటీ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మిర్చికి మద్దతు ధర ప్రకటించాలని, బగర్‌హుకుమ్ సాగుదారులకు హక్కు పత్రాలు ఇవ్వాలని, విద్యుత్ ప్రవేటీకరణను రద్దు చేయాలని, కొత్త వ్యవసాయ మార్కెట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ రైతు వ్యవసాయ కార్మికుల పోరాట కమిటీ మార్చి 10న విధాన సౌద చలో నిర్వహిస్తున్నట్లు అఖిల భారత రైత కృషి కార్మిక సంఘం తెలిపింది. నగరంలోని పత్రికాభవనంలో మంగళవారం విలేకరుల సమావేశంలో కమిటీ నాయకులు గోవింద,గురల్లిరాజా, హనుమంతప్ప, లింగప్ప మాట్లాడుతూ రైతులకు స్థిరమైన జీవనోపాధి కల్పిస్తామని అన్నారు. ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వాలు రైతల జీవితాలతో దుర్భరంగా మార్చిన కొత్త వ్యవసాయ విధానాలను తీసుకువచ్చాయని మండిపడ్డారు. విత్తనాలు, ఎరువులు, పురుగులమందుల ధరలు పెరిగాయి. రైతులే దేశానికి వెన్నెముక అని చెప్పుకునే ప్రభుత్వం రైతుల వెన్నెముకను విరిచేస్తోందన్నారు. ఇది చాలదన్నట్లు ప్రతి సంవత్సరం అధిక వర్షపాతం, కరువువాతావరణ తీవ్రతలు, వ్యాధులు, వరదల కారణంగా తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించడానికి తమ వద్ద డబ్బు లేదని చెప్పే ప్రభుత్వాలు కరోనావైరస్ మహమ్మారి తర్వాత కార్పోరేట్ కంపెనీలకు రూ. 15లక్షలకోట్ల రుణాలను మాఫీ చేశాయని మండిపడ్డారు. బగర్ హుకుం సాగుదారులకు వెంటనే హక్కు పత్రాలు ఇవ్వాలన్నారు. కొత్త వ్యవసాయ మార్కెట్ నమూనాను వదిలివేయాలన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. జిల్లాలోని అన్ని వర్గాల రైతులు విధానసౌద చలో నిరసనలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న కమిటీ నాయకులు

బర్డ్‌ఫ్లూపై యంత్రాంగం అప్రమత్తం

- కప్పగల్లు గ్రామాన్ని సందర్శించిన జడ్పీ సీఈఓ



కోళ్ల ఫాంలను పరిశీలిస్తున్న జడ్పీ సీఈఓ అహ్మద్ హ్యారీస్ సుమేర్

బళ్లారి గాంధీనగర్/రూరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): పొరుగున్న ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, బళ్లారి సరిహద్దు జిల్లాలో బర్డ్‌ఫ్లూ విస్తరిస్తున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమయ్యింది. బళ్లారి, సండూరు తాలూకా పరిధిలో ఇప్పటికే బర్డ్‌ఫ్లూ వ్యాధి కారణంగా వేలాది కోళ్ళు మృత్యువాత పడ్డాయి. ఈ నేపథ్యంలో జిల్లా పాలనా మండలి, జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కోళ్ళఫారం నిర్వాహకులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తూ బర్డ్‌ఫ్లూ వ్యాధి విస్తరించకుండా జాగ్రత్తలు చేబడుతోంది. జిల్లాధికారి రోజూ బర్డ్‌ఫ్లూ వ్యాధి నియంత్రణపై పశుసంవర్ధక శాఖ అధికారులతో సమాలోచన చేస్తూ ఎప్పటికప్పుడు అవసరమైన ఆదేశాలు జారీ చేస్తున్నారు. ప్రజలు బర్డ్‌ఫ్లూ వ్యాధిపట్ల భయాందోళన చెందాల్సిన అవసరం లేదని, జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. గత రెండు రోజుల క్రితం కప్పగల్లు చుట్టుప్రక్కల గ్రామాల్లో ఏర్పాటు చేసిన కోళ్ళఫారమ్‌లలో వేలాది కోళ్ళు మృతి చెందిన నేపథ్యంలో జిల్లా పంచాయతీ సిఇఓ అహ్మద్ హారీస్ సుమేర్ మంగళవారం తాలూకా పంచాయతీ ఈఓ బసప్పతో చేరి గ్రామంలోని కోళ్ళ ఫారమ్‌లను పర్యవేక్షించారు. కేళ్ళఫార చుట్టుప్రక్కల పరిశుభ్రత పాటించాలని నిర్వాహకులకు సూచించారు. అదే సందర్భంలో అక్కడకు చేరుకున్న ప్రజలతో మాట్లాడారు. బర్డ్‌ఫ్లూ వ్యాధి సాంక్రమిక వ్యాధి కాదని, ప్రజలు ఎలాంటి భయాందోళన చెందాల్సిన అవసరంలేదన్నారు. తాలూకా పంచాయితీ ఈఓ మడగిన బసప్ప పీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ.. ముగ్గురి దుర్మరణం

రాయచూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీ కొని ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. జిల్లాలోని సింధనూరు తాలూకా ముళ్కూరు క్యాంప్ సమీపంలో సోమవారం రాత్రి రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృత్యువాత పడ్డారు. బసాపుర గ్రామానికి చెందిన శివప్ప హుసేనప్ప(37), చిక్కబేరగా గ్రామానికి చెందిన హనుమేశ్(30) అక్కడికక్కడే మృతి చెందగా, కోళబాళ గ్రామానికి చెందిన మౌనేశ్ మహాదేవప్ప(21) సింధనూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. సింధనూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

గ్రూపు తగాదా.. వ్యక్తి మృతి

జిల్లాలోని మాన్వి తాలూకా మల్లిగెమడువు గ్రామంలో సోమవారం రాత్రి రెండు గ్రూపుల మధ్య జరిగిన ఘర్షణలో ఒక వ్యక్తి బలైయ్యాడు. మల్లిగెమడువు గ్రామానికి చెందిన భీమరాయ(45) దాడిలో తీవ్రంగా గాయపడగా ఆయన మంగళవారం ఉదయం మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. ఇందుకు సంబంధించి పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు వారు తెలిపారు. రెండు గ్రూపుల మధ్య నెలకొన్న తగాదాలతో ఒకరిపై ఒకరు కర్రలతో దాడి చేసుకోగా దాదాపు 10 మందికి పైగా వ్యక్తులకు గాయాలైనట్లు గ్రామస్థులు తెలిపారు.

పోలీసు తుపాకీ మిస్ ఫైర్

- మహిళకు గాయాలు
- ఆస్పత్రికి తరలింపు



గాయపడిన మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

బళ్లారి గాంధీనగర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సాధారణంగా పోలీసులకు తుపాకీ కాల్చడంలో శిక్షణ ఇచ్చే సమయంలో ఫైరింగ్ ప్రాంతంలో చుట్టు ప్రక్కల కొన్ని మీటర్ల పరిధిలో నిషేధిత ప్రాంతంగా పరిగణిస్తారు. పోలీసులకు శిక్షణ సమయంలో అటువైపు మనుషులు గాని, పశువులు గాని వెళ్ళకుండా జాగ్రత పడుతారు. అయితే కొప్పళ తాలూకా పరిధిలోని జబ్బలగుడ్డ(కొండ) గ్రామం సమీపంలో కుమ్మటదుర్గ వద్ద మంగళవారం డీఏఆర్ పోలీసులకు ఫైరింగ్ శిక్షణ ఇస్తున్న సమయంలో ఆకస్మికంగా మిస్ ఫైర్ కావడంతో సమీపంలో పశువులు కాస్తున్న రేణుకమ్మ కబ్బేర అనే మహిళ భుజం వద్ద బుల్లెట్ దూసుకెళ్ళడంతో గాయపడింది. గట్టిగా అరుపులు వినబడడంతో పోలీసులు గాయపడిన మహిళను మునిరాబాద్ ఆసుపత్రికి తరలించారు.

పాదయాత్రగా వెళ్తూ మృత్యు ఒడిలోకి..

బళ్లారిరూరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలో గూళ్యం గ్రామంలో జరిగే గాది లింగేశ్వర జోడు రథోత్సవ వేడుకలకు పాదయాత్రగా వెళ్తున్న ఇద్దరు యువకులు మృత్యు ఒడిలోకి చేరారు. బళ్లారి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం నేమకల్లు గ్రామానికి చెందిన వన్నూరుస్వామి, వందక్షి దంతుల కుమారుడు గణేష్(19) గాలి తిప్పేస్వామి, రత్నమ్మ దంపతులు కుమారుడు గాలి నాగరాజు(20) బొలెరో వాహనం ఢీకొని మృతిచెందారు. గణేష్, గాలి నాగరాజు, రామంజినేయులు, శివ తదితరులు కలసి సోమవారం సాయంత్రం 5 గంటలకు గ్రామం నుంచి పాదయాత్రగా బయలదేరారు. బళ్లారి మీదుగా గూళ్యం వెళ్తూ మోకా రోడ్డులో సంగనకల్లు గ్రామ సమీపంలో సిల్వర్ క్రాస్ వద్ద రాత్రి 9 గంటల సమయంలో రోడ్డుపక్కన పాదయాత్రగా వెళ్తున్నారు. గణేష్, గాలి నాగరాజులను మోకాకు చెందిన ఓ వ్యక్తి బొలెరో వాహనం అతివేగంగా వచ్చి ఢీకొనింది. గణేష్, గాలి నాగరాజు తీవ్ర గాయాలతో అక్కడిక్కడే మృతి చెందారు. మిగతావారికి కొద్దిగా గాయాలయ్యాయి. బళ్లారి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకోని విచారిస్తున్నారు. ఇద్దరు యువకులు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రెండు కుటుంబాలు శోకసంద్రంలో నిండిపోయాయి.



గర్భిణులకు అవగహన కల్పిస్తున్న డీహెచ్ఓ రమేశ్‌బాబు

గర్భిణులు ఒత్తిడికి గురి కాకూడదు

- ఇంటింటి పర్యటనలో డీహెచ్ఓ రమేష్ బాబు

బళ్లారి సిటీ, మార్చి 4(ఆంధ్రజ్యోతి):గర్భధారణ సమయంలో ఎలాంటి ఒత్తిడికి గురికాకూడదని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి రమేశ్‌బాబు తెలిపారు. తాలూకాలోని హడ్లిగి గ్రామంలో మంగళవారం ఆయన పలు కాలనీల్లో పర్యటించారు. కాలులో గాయంతో బాధపడుతున్న గర్భిణీని గుర్తించి ఆమె తల్లికార్డు, ఇతర పత్రాలను తనిఖీ చేసి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. గర్భిణీలు తమ కుటుంబాలలోని ఒడిదుడుకులను ప్రశాంతంగా ఎదుర్కోవడమే కాకుండా ప్రసవ వేదనలో ఉన్న గర్భిణీ స్త్రీలు ఎటువంటి ఒత్తిడి లేదా అనుభవించకుండా ఉండటానికి కుటుంబ సభ్యులు కూడా సహకరించాలి. సజావుగా ప్రసవం జరిగేలా సహకరించాలని ఆయన అన్నారు. గర్భిణీల్లో ప్రమాద సంకేతాలు కనిపిస్తే ప్రసవానికి 3రోజుల ముందు ఆసుపత్రిలో చేరడానికి కుటుంబ సభ్యులు అనుమతించాలన్నారు. శారీరకంగా దృఢంగా ఉండటానికి కాల్షియం మాత్రలతో పాటు, డాక్టర్ సలహా మేరకు రోజుకు కనీసం 180మాత్రలు ఉచితంగా ఐరన్ మాత్రలు తీసుకోవాలని , రక్తహీనత తీవ్రంగా ఉంటే 6నెలల పాటు రోజుకు రెండుసార్లు 360 మాత్రలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈసందర్భంగా జిల్లా ఆరోగ్య విద్య అధికారి ఈశ్వర్ దాసప్ప, ఆశా వర్కర్లు గంగమ్మ, శశికళ, రత్నమ్మ, ఇతర సిబ్బంది, తల్లులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై పోలీసుల అవగాహన



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

బళ్లారి సిటీ,మార్చి 4(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతపై వాహన డ్రైవర్లకు పోలీసులు అవగాహన కల్పించారు. మంగళవారం నగరంలోని రాయల్‌సర్కిల్లో పోలీసులు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ట్రాపిక్ పోలీసు దేవెంద్రప్ప మాట్లాడుతూ వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారుచోదుకులు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని, వాహనానికి సంబంధించిన డ్రైవింగ్ లైసెన్స్ ఇన్స్యూరెన్స్ కాలుష్య పత్రాలను బండిలోనే ఉంచుకోవాలన్నారు. వాహనదారులు వాహనాన్ని నడిపేటప్పుడు ముందు బండిని ఓవర్‌టేక్ చేయరాదని వాహనాల మధ్య దూరం పాటించాలన్నారు. ఈసందర్భంగా ట్రాపిక్ పోలీస్ చాంద్, చంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర గ్రాంట్లలో వివక్ష తగదు



డీసీ కార్యాలయ సిబ్బందికి వినతి ప్రతం అందిస్తున్న కార్పొరేషన్ సభ్యులు

బళ్లారి సిటీ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే మహాత్మగాంధీ వికాస్ యోజన గ్రాంట్ల పంపిణీలో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వివక్ష చూపారని, తమ వార్డుకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దకపోతే నిరాహారదీక్ష చేడపడుతానని 25వవార్డు సభ్యులు గోవింద రాజులు హెచ్చరించారు. మంగళవారం కార్పొరేషన్ బీజేపీ సభ్యులతో కలిసి వెళ్ళి జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించి, వారు మాట్లారు. మహాత్మగాంధీ వికాస్ యోజనకు రూ. 127 కోట్ల గ్రాంట్ లభించింది.ఇందులో కల్‌బజార్ ప్రాంతానికి రూ. 40కోట్లు విడుదలయ్యాయి.ఇందులో రూ. 76లక్షలు, 25, 26,27 వార్డుల పరిధిలోకి వచ్చే ప్రాజెక్టుకు కేటాయించారు.దీనివల్ల మావార్డు అభివృద్ధికి అన్యాయం జరిగింది. మా వార్డు అభివృద్ధికి నిధులు సమకూర్చాలి.దీనిని రేపటిలోగా ప్రకటించాలి, లేకపోతే వార్డులో నిరాహార దీక్ష చేపడతామన్నారు. ఈసందర్భంగా సభ్యులు హనుమంతప్ప,గోవిందరాజులు, శ్రీనివాస్‌మోత్కార్, ఇబ్రహీంబాబు, కోనంకి తిలక్, హనుమంతప్ప, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రముఖ తమిళ కవి నందలాలా కన్నుమూత

- ముఖ్యమంత్రి స్టాలిన్ సంతాపం



నందలాలా (ఫైల్)

చెన్నై, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ప్రముఖ తమిళ కవి, రాష్ట్ర అభ్యుదయ రచయితల, కళాకారుల సంఘం ఉపాధ్యక్షుడు, రాష్ట్ర సాహిత్య, సంగీత రంగ స్థల సర్వసభ్య మండలి సభ్యుడు నందలాలా మంగళవారం ఉదయం కృష్ణగిరి జిల్లా హోసూరు సమీపం లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్ను మూశారు. బ్యాంక్ ఉద్యోగిగా జీవనయాత్రను ప్రారంభించిన నందలాలా మూడు దశాబ్దాలకు పైగా అభ్యుదయ రచయితలు, కళాకారుల సంఘం ఉపాధ్యక్షుడిగా విశిష్ట సేవలందించారు. ప్రస్తుతం రాష్ట్ర పాఠ్యపుస్తకాల సంస్థ అధ్యక్షుడిగా ఉన్న దిండుగల్ లియోని నిర్వహించే పట్టిమండ్రాల్లో (వివాద వేదికలపై) ప్రసంగించి తమిళ శ్రోతలను మైమరపించేవారు. కొన్నేళ్ల క్రితం తిరుచ్చి కల్‌మండపం ప్రాంతంలో ఇల్లు నిర్మించుకుని అక్కడే స్థిరనివాసమేర్పరచుకున్నారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు. కొంతకాలంగా బెంగళూరులోని కుమార్తె వద్ద ఉండేవారు. ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై అక్కడే ఓ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. నందలాలా అనారోగ్యానికి గురైనట్లు తెలుసుకున్న డీఎంకే ఎంపీ ఎ.రాజా తన స్నేహితుల ద్వారా వైద్యం కోసం రూ.5లక్షలు కూడా అందించారు. ఈ పరిస్థితులలో మంగళవారం ఉదయం చికిత్స ఫలించక నందలాలా మృతి చెందినట్లు రాష్ట్ర అభ్యుదయ రచయితల, కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి ఆదవన్ దీక్షన్యా ప్రకటించారు. నందలాలా అంత్యక్రియలు తిరుచ్చి కల్‌మండపం ప్రాంతంలోని ఆయన నివాసం వద్ద బుధవారం జరుగుతుందని కుటుంబీకులు పేర్కొన్నారు.

తమిళ సాహిత్య రంగానికి తీరనిలోటు...

తమిళ కవి నందలాలా మృతి రాష్ట్ర అభ్యుదయ రచయితలు, కళాకారుల సంఘానికే కాకుండా తమిళ సాహిత్య రంగానికి కూడా తీరని లోటని సీఎం స్టాలిన్ తెలిపారు. నందలాలా మృతిపట్ల ముఖ్యమంత్రి ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఈ మేరకు ఓ సందేశం వెలువరిస్తూ పెరియార్ సిద్ధాంతాలను ప్రజలలోకి తీసుకెళ్లేలా నందలాలా ప్రతి సభల్లోనూ ప్రసంగించేవారని తెలిపారు. ఇటీవల తన జన్మదిన వేడుకల ముందస్తు సభల్లోనూ ఆయన ప్రసంగించారని గుర్తు చేశారు.

ఎక్కువ కేసులు పరిష్కారం కావాలి: ఎస్పీ

పుట్టపర్తి రూరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఈ నెల 8న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలని పోలీసు అధికారులను ఎస్పీ రత్న ఆదేశించారు. డీపీఓ నుంచి డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో ఆమె మంగళవారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. రాజీ కాదగిన క్రిమినల్, సివిల్, రోడ్డు ప్రమాదాలు, కుటుంబ తగాదాల కేసుల కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు.

హోసూరు జోన్



గదులను ప్రారంభిస్తున్న ఎంపీ గోపీనాథ్, ఎమ్మెల్యే ప్రకాశ్

పాఠశాలలో అదనపు గదుల ప్రారంభం

హోసూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని శూలగిరి పంచాయతీ యూనియన్‌లోని తిమ్మసంద్ర గ్రామంలో పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాలలో రూ.32.80 లక్షలతో రెండు తరగతి గదులను నిర్మించారు. కృష్ణగిరి ఎంపీ గోపినాథ్, హోసూరు ఎమ్మెల్యే వై ప్రకాశ్‌లు లాంఛనంగా ప్రారంభించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను పెంచేందుకు తమవంతు సహకారం అందిస్తామని ఎంపీ, ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. యూనియన్ ప్రాథమిక పాఠశాలకు సీఎఫ్ఎస్ ఐటీఎస్ పథకం క్రింద తరగతి గదులు నిర్మించారు. కార్యక్రమంలో శూలగిరి ఉత్తర యూనియన్ కార్యదర్శి నాగేశ్, కృష్ణన్, డీఎంకే ఇన్‌చార్జ్‌లు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడిగా నాగరాజన్

హోసూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): తమిళనాడు బ్రాహ్మణ సంఘం కృష్ణగిరి జిల్లా 2025-30 సంవత్సరానికి జిల్లా అధ్యక్షుడిగా హోసూరు శాఖ అధ్యక్షుడు నాగరాజన్ ఎకగ్రీవంగా ఎన్నికైయ్యారు. నాగరాజన్‌తో జిల్లా ఎన్నికల అధికారి మాధవరామన్ ప్రమాణ స్వీకారం చేయించారు. కృష్ణగిరి శాఖ పదాధికారులు శ్రీనివాసన్, రామన్, కుమార్, బాలసుబ్రహ్మణ్యం కృష్ణస్వామి, ప్రత్యేక ఆహ్వానితులుగా రాష్ట్ర సంస్థ కార్యదర్శి కుమార్, సేలం జిల్లా అధ్యక్షుడు గురుస్వామి పాల్గొన్నారు.



నాగరాజన్‌ను సత్కరిస్తున్న సంఘం సభ్యులు



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి

- సకాలంలో పనులు పూర్తి చేయాలి : కాంట్రాక్టర్లకు కలెక్టర్ సూచన

హోసూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లాలో గ్రామీణాభివృద్ధిశాఖ ద్వారా చేపట్టిన పలు నిర్మాణాలను కలెక్టర్ దినేశ్‌కుమార్ స్వయంగా పరిశీలించారు. బర్గూరు పంచాయతీ యూనియన్ ఓరప్పం, మల్లప్పాడి, కొండ నాయనపల్లి, జగదేవి పంచాయతీలకు వ్యవసాయ, ఉద్యానవన శాఖల ద్వారా చేపట్టిన పథకాలను మంగళవారం పరిశీలించారు. పాడి ఆవుకు సబ్సిడీ రూ20వేలు ఇస్తుండగా తేనెటీగల పెంపకానికి, వర్మీకంపోస్టు పథకాల లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే వ్యవసాయ ఆయకట్టు పథకం క్రింద రైతుల వివరాలను ఎలక్ట్రానిక్ పద్ధతిలో సేకరించి రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను అందించే పథకాన్ని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఉద్యానవన శాఖ ద్వారా షెడ్‌ను, పండ్ల చెట్ల నారు, వర్మీకంపోస్టు బెడ్‌లను సందర్శించారు. రైతుల నుంచి వరి కొనుగోలు చేసిన తర్వాత శుభ్రం చేసి విత్తన పరీక్ష కేంద్రానికి పంపి తర్వాత నాణ్యమైన విత్తనాలను ధ్రువీకరించిన తర్వాత వ్యవసాయ విస్తరణ కేంద్రం, ఉప వ్యవసాయ విస్తరణ కేంద్రం గోదాములకు పంపి రైతులకు పంపిణీ చేస్తారని కలెక్టర్ తెలిపారు. సకాలంలో పనులు పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ వెంట ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ పచ్చయప్పన్, డిప్యూటీ డైరెక్టర్ బర్గూరు ప్రాంతీయ సహాయ సంచాలకులు కాశీముత్తు, ప్రాంతీయ అభివృద్ధి అధికారి శివశంకరీ, రూరల్ డెవలప్‌మెంట్ అసిస్టెంట్ ఇంజనీర్ , అసిస్టెంట్ ఇంజనీర్ , మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి

సిరుగుప్ప, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలంలో ఆరోగ్యంపై జాగ్రత్తలు అత్యవసరమని వైద్యులు డాక్టర్ మహమ్మద్ ఖాసీమ్ సాబ్ తెలిపారు. మంగళవారం సిరుగుప్ప పట్టణం తాలుకా పంచాయతీ భవనంలో పంచాయతీ రాజ్ శాఖ, వైద్యశాఖ ఆధ్వర్యంలో పంచాయతీ అభివృద్ధి అధికారులకు, కార్యదర్శులకు, అధ్యక్షులకు గ్రామీణ ప్రాంతాలలో వేసవికాలంలో తీసుకునే ఆరోగ్య సమస్యలపై తీసుకునే జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైద్యులు మహమ్మద్ ఖాసీమ్ సాబ్ మాట్లాడుతూ పిల్లలు, వృద్దులు వేసవి కాలంలో ఎండలు విపరీతంగా వుండటంతో చెట్ల నీడ కింద ఎక్కువగా కాలయాపన చేయాలని తెలిపారు. చల్లని పానీయాలు తాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఎండవేడిమికి జ్వరాలు, ఇతర రోగాలు సోకితే తక్షణమే ప్రభుత్వాస్పత్రిని సందర్శించి ప్రథమ చికిత్స చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా తాలూకా పంచాయతీ మేనేజర్ బసవరాజు, పంచాయతీ అభివృద్ధి అధికారులు రమేష్, నాగరాజ, కార్యదర్శులు, అధ్యక్షులు పాల్గొన్నారు.